క్లుప్తంగా

నేడు ఆస్తిపన్ను చెల్లింపు కౌంటర్లు తెరిచే ఉంటాయి

లింగోజిగూడ: అంబేడ్కర్ జయంతి సందర్భంగా నేడు ప్రభుత్వ (శుక్రవారం) సెలవు ఉన్నప్పటికీ ఆస్తి పన్ను చెల్లింపుదారుల సౌకర్యార్థం ఎల్బీనగర్ సర్కిల్ కార్యాలయంలోని సిటిజన్ సర్వీస్ సెంటర్ తెరిచే ఉంటుందని సరూర్‌నగర్ సర్కిల్ డీసీ కృష్ణయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పని దినాల్లో ఆస్తి పన్ను చెల్లించే వీలు లేని వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని పన్ను చెల్లించాలని డీసీ కోరారు.

ఘనంగా రథోత్సవం

లింగోజిగూడ: డివిజన్ పరిధిలోని గ్రీన్ పార్క్ కాలనీలోని వేంకటేశ్వర స్వామి దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా రథోత్సవం కనుల పండువగా జరిగింది. గురువారం రాత్రి భాజా భజంత్రీలతో కాలనీలోని ప్రతి రోడ్డులో రథోత్సవాన్ని నిర్వహించారు. మహిళలు ఆట పాటలతో అలరించారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు కమలేష్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి బాల్‌రెడ్డి, సభ్యులు నర్సిరెడ్డి, శ్రీదేవి, సత్యనారాయణ, చంద్రగుప్తా, రవీందర్‌రెడ్డి, నరసింహగౌడ్, నారాయణరెడ్డి, రామస్వామి, జగన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

షాదీముబారక్ చెక్కుల పంపిణీ



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే బలాల

మలక్‌పేట: ఎమ్మెల్యే అహ్మద్ బలాల పంజేషా హాలోని కార్యాలయంలో గురువారం సైదాబాద్ మండల పరిధికి చెందిన లబ్ధిదారులకు షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. ప్రెస్‌కాలనీ, సపోటాబాగ్, కరణ్‌బాగ్, అమీన్‌కాలనీ, సైదాబాద్, ఫరక్ కాలనీ, గ్రీన్‌లాండ్ కాలనీ, దయానంద్‌నగర్, ఫర్హాకాలనీ, ఆనంద్ నగర్, మూసారంబాగ్, అక్బర్‌బాగ్ ప్రాంతాలకు చెందిన 175 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో సైదాబాద్ మండల ఆర్‌ఐ హరిబాబు, రెవెన్యూ అధికారులు, ఎంఐఎం నేతలు పాల్గొన్నారు.

రచయిత్రి శ్రీవల్లీ రాధికకు ఓయూ డాక్టరేట్



వనస్థలిపురం: ప్రముఖ రచయిత్రి, వనస్థలిపురం కమలానగర్ కాలనీకి చెందిన టి.శ్రీవల్లీ రాధికకు ఉస్మానియా విశ్వ విద్యాలయం డాక్టరేట్‌ను ప్రకటించింది. 'తెలుగు సాహిత్యం–భక్తిరసం' అన్న అంశంపై శ్రీవల్లీ రాధిక ప్రొఫెసర్ డాక్టర్ పి.వారిజారాణి పర్యవేక్షణలో చేసిన పరిశోధనకుగాను ఓయూ డాక్టరేట్ ప్రకటించింది. ఎంఏ (తెలుగు) చేసిన శ్రీవల్లీ రాధిక గత 20 సంవత్సరాలుగా పలు కథలను, నవలలను రచించారు. ఆమె రాసిన సాహిత్య విమర్శనా వ్యాసాలు, కవితా సంపుటాలు, పద్య కవిత్వం, బాల సాహిత్యం పలు పత్రికల్లో ప్రచురితమయ్యాయి. గేయ రచనలు ఆకాశవాణిలో లలిత గీతాలుగా ప్రసారమయ్యాయి.ఆమె రచించిన కథలు, కథా సంపుటికిగానూ పలు సంస్థలు ఉత్తమ కథా రచయిత్రి పురస్కారాలు అందజేశాయి.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

హస్తినాపురం: పేదల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను సద్వినియోగం చేసుకోవాలని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతానాయక్ అన్నారు. గురువారం ఆమె డివిజన్ పరిధిలోని నందనవనం కాలనీలోని బస్తీ దవాఖానాలో కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, కంటివెలుగు పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకుని పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బస్తీ దవాఖానా వైద్యులు, బీఆర్ఎస్ నాయకులు బోయ ఆదిలక్ష్మి, గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, విష్ణుగౌడ్, సిగిపేట్ నరేశ్, నారాయణచారి, శశి, సంచివిష్ణు, రాజు, యాదగిరి, మల్లేశ్ పాల్గొన్నారు.

వేసవి సెలవుల్లో క్లాసుల నిర్వహణపై నిరసన

హస్తినాపురం: ప్రభుత్వ జూనియర్ కళాశాలలు వేసవి కాలంలో సెలవులు ప్రకటిస్తే కార్పొరేట్ విద్యాసంస్థలు మండుటెండల్లో క్లాసులు నిర్వహించడం ఎంతవరకు సమంజసమని కార్పొరేట్ విద్య నియంత్రణ జేఏసీ చైర్మన్ చెన్నోజు శ్రీనివాసులు ప్రశ్నించారు. గురువారం హస్తినాపురం చౌరస్తాలోని అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేసిన ఆయన అధికారులకు బుద్ధి ప్రసాదించాలని నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పోలే విష్ణు, యోగేశ్ యాదవ్, సతీష్‌కుమార్, వినోద్‌కుమార్, కోట్లవాసు, లక్‌పతి తదితరులు పాల్గొన్నారు.

ముదురుతున్న ఎండలు...
అడుగంటుతున్న బోరుబావులు

- లోప్రెషర్‌తో జలమండలి నీటిసరఫరా
- కాలనీల్లో నీటి కష్టాలు షురూ



ఓ కాలనీలో వెలసిన బహుళ అంతస్తుల భవనం



కాలనీల్లో నీటి సరఫరాకు సిద్ధమవుతున్న జలమండలి నీటి ట్యాంకర్

వనస్థలిపురం: రోజు రోజుకూ ఎండలు ముదురుతుండటంతో నీటి కష్టాలు అప్పుడే మొదలవుతున్నాయి. కాలనీల్లో బహుళ అంతస్తుల భవనాలు, అపార్ట్‌మెంట్లు పుట్టగొడుగుల్లా వెలుస్తుండటంతో నీటి వాడకం పెరిగి బోరు బావులు అడుగంటుతున్నాయి. జలమండలి నీటి సరఫరాలో కూడా ప్రెషర్ తగ్గడంతో సరిపడా నీరు అందక కాలనీల ప్రజలు జలమండలి, ప్రైవేట్ నీటి ట్యాంకర్లను ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొంటోంది. ఏప్రిల్‌లోనే ఇలావుంటే వచ్చే మే నెలలో పరిస్థితి ఎంత దారుణంగా ఉంటుందోనని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

విచ్చలవిడిగా బోరు బావుల తవ్వకం...

వనస్థలిపురం, బీఎన్‌రెడ్డినగర్, హస్తినాపురం, హయత్‌నగర్, మన్సూరాబాద్, నాగోలు తదితర డివిజన్లలో బహుళ అంతస్తుల భవనాలు, అపార్ట్‌మెంట్లు, వాణిజ్య భవనాలు శరవేగంగా రూపుదిద్దుకుంటున్నాయి. దీంతో సహజంగానే నీటి వాడకం ఎక్కువై విచ్చలవిడిగా బోరు బావులు తవ్వుతున్నారు.

బడా నిర్మాణ సంస్థలు తమ భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని 1500 నుంచి 2000కు పైచిలుకు ఫీట్ల లోతుగా బోరులను తవ్వి భూగర్భ జలాలను తోడేస్తున్నారు. దీంతో కాలనీల్లో తక్కువ లోతులో ఉన్న బోరు బావులు ఎండిపోతున్నాయి.

వాల్టా చట్టం అమలు ఎక్కడ?

కొత్తగా వ్యక్తిగత బోర్లు, బావుల తవ్వకాలపై ఆంక్షలు వర్తిస్తాయి. భూగర్భ జలాల పరిరక్షణకు వాల్టా (వాటర్, ల్యాండ్ అండ్ ట్రీస్ యాక్ట్) చట్టం అమలులో ఉంది. బోరు వేయడానికి 15 రోజుల ముందు సంబంధిత యజమాని భూగర్భ జలవనరుల అధికారులకు సమాచారం అందజేసి, వారి నుంచి అనుమతి పొందాలి. బోర్‌వెల్ తవ్వే యంత్రాల యజమానులు విధిగా తమ పేర్లను సంబంధిత అధికారుల వద్ద నమోదు చేసుకుని తవ్వకాలకు అనుమతి తీసుకోవాలి. కానీ ఇవేమి లేకుండా కాలనీల్లో విచక్షణారహితంగా బోరు బావులను తవ్వేస్తున్నారు.

తప్పనిసరిగా నీటి కొనుగోలు...

కాలనీలలో జలమండలి రోజు విడిచి రోజు నీటి సరఫరా చేస్తోంది. ఇంతకు ముందు రెండు గంటలపాటు సరఫరా ఉండగా, ప్రస్తుతం గంటసేపు మాత్రమే సరఫరా జరుగుతోంది. దీనికితోడు పలు ప్రాంతాలలో లోప్రెషర్‌తో సరఫరా జరుగుతుండటంతో సరిపోనూ నీరు రావడం లేదని కాలనీల ప్రజలు వాపోతున్నారు. ఉన్న బోర్లు అడుగంటిపోవడంతో గత్యంతరంలేక జలమండలి నుంచి 5000 వేల లీటర్ల కెపాసిటీ గల ట్యాంకర్ రూ. 500 లకు, ప్రైవేట్ ట్యాంకర్లకు రూ. 650 మొదలుకొని రూ. 800 వరకు వెచ్చించి నీటిని తెప్పించుకోవాల్సి వస్తోందని పేర్కొంటున్నారు.

నీటి పొదుపే మేలు...

నీటి ఎద్దడి నివారణకు ఉన్న జలాలను పొదుపుగా వాడుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. భూగర్భ జల రక్షణకు ప్రతిఒక్కరూ తమ ఇల్లు, పరిసరాలలో ఇంకుడుగుంతలు ఏర్పాటు చేసుకోవాలని అధికారులు, పలు సంస్థలు ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారు. కాగా జలమండలి ఆధ్వర్యంలో నీటి సరఫరా చేసే సమయంలో పలు ప్రాంతాలలో లీకేజీలతో విలువైన నీరు వృథాగా రోడ్లపాలు అవుతోందని, లీకేజీలను అరికట్టడానికి జలమండలి తగిన చర్యలు తీసుకోవాలని, అలాగే లోప్రెషర్ సమస్యను అరికట్టాలని కాలనీల ప్రజలు కోరుతున్నారు.

అడ్డగోలు తవ్వకాలతోనే సమస్యలు

కాలనీల్లో బహుళ అంతస్తులు, అపార్ట్‌మెంట్ల నిర్మాణాలతో నిర్మాణదారులు వేలాది ఫీట్ల లోతులో బోరుబావులను యథేచ్ఛగా తవ్వేస్తున్నారు. దీంతో చిన్నా, చితక బోరుబావులు ఎండిపోతున్నాయి. జలమండలి నీటిసరఫరా కూడా లోప్రెషర్‌తో వస్తోంది. దీంతో గత్యంతరం లేక ప్రైవేట్ ట్యాంకర్ల నుంచి నీరు తెప్పించుకోవాల్సి వస్తోంది.

– జి.రామకృష్ణ, విశ్వేశ్వరాయ ఇంజినీర్స్‌కాలనీ, హస్తినాపురం

అభివృద్ధి పనుల్లో నాణ్యత లోపిస్తే సహించం: వంగ



భూగర్భ డ్రైనేజీ విస్తరణ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ వంగ మధుసూదన్‌రెడ్డి

చంపాపేట: డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యత లోపిస్తే సహించేది లేదని స్థానిక కార్పొరేటర్ వంగ మధుసూదన్‌రెడ్డి కాంట్రాక్టర్‌ను హెచ్చరించారు. గురువారం ఆయన బైరామల్‌గూడ ప్రాంతంలోని సాయినగర్ కాలనీలో రూ. 39 లక్షలతో ప్రారంభించిన భూగర్భ డ్రైనేజీ విస్తరణ పనులను వాటర్ వర్క్స్ మేనేజర్ రమ్య భారతితో కలిసి పరిశీలించారు. కాలనీల్లో అభివృద్ధి పనులు జరిగేటప్పుడు ఇబ్బందులు సహజమని, కాలనీవాసులు సంయమనం పాటించి అభివృద్ధికి సహకరించాలని కోరారు. అనంతరం ఆయన గ్రీన్‌పార్క్ కాలనీలోని శ్రీవెంకటేశ్వర స్వామివారి ఆలయంలో నిర్వహిస్తున్న పంచమ దశ బ్రహ్మోత్సవాల్లో పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో డివిజన్ బీజేపీ అధ్యక్షుడు పోరెడ్డి రవీందర్‌రెడ్డి, కాలనీ సంక్షేమ సంఘ ప్రతినిధులు బాలరాజు, పెంటయ్యగౌడ్, మహేందర్, రవినాయక్, రాజు, యాదయ్య, మోహన్ నాయక్ పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణ సభను విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

దిల్‌సుఖ్‌నగర్: హైదరాబాద్ నగరం నడిబొడ్డున ట్యాంక్ బండ్‌పై రాష్ట్ర ప్రభుత్వం 125 అడుగుల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం చారిత్రాత్మకమని మహేశ్వరం నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్ శర్మ అన్నారు. గురువారం ఆర్‌కేపురంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో పార్టీ సీనియర్ నేత కొంద్రు శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ట్యాంక్ బండ్‌పై అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుతో ఎంతో మంది స్ఫూర్తి పొందుతారని అన్నారు. సీఎం కేసీఆర్ రాష్ట్ర నూతన సచివాలయానికి అంబేడ్కర్ పేరు పెట్టడం అభినందనీయమన్నారు. అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పెద్ద ఎత్తున బీఆర్ఎస్ నాయకులు, దళిత సంఘాల నేతలు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు రవీందర్ రెడ్డి, బీరెల్లి వెంక రెడ్డి, దేవేందర్, శ్రీనివాస్, జగన్,యాదమ్మ, రమాచారి, దుబ్బాక శేఖర్, జగన్మోహన్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, కంచర్ల శేఖర్, రమేష్, చరణ్, శంకర్ పాల్గొన్నారు.

అంబేడ్కర్ సేవలు చిరస్మరణీయం

చంచల్‌గూడ: దేశానికి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చేసిన సేవలు మరువలేనివని బీజేపీ దళిత మోర్చా యాకత్‌పురా కన్వీనర్ మోహన్ కృష్ణ అన్నారు. అంబేడ్కర్ జయంతి సందర్భంగా గురువారం దళిత మోర్చా డివిజన్ అధ్యక్షుడు దర్శనం ప్రదీప్ ఆధ్వర్యంలో కుర్మగూడ డివిజన్ మాదన్నపేటలో అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్‌ల విగ్రహాల శుద్ధి కార్యక్రమం నిర్వహించారు. విగ్రహాలకు పాలభిషేకం చేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు ధర్మతేజ, తంగెళ్ల సుధీర్, జనపాల మధు, అజయ్, యోగి, వరుణ్, నాగరాజు పాల్గొన్నారు.

నాసిరకం పనులపై కార్పొరేటర్ ఆగ్రహం

పనులు నిలిపివేయాలని ఆదేశం



నిర్మాణంలో వాడుతున్న డస్ట్‌ను పరిశీలిస్తున్న లచ్చిరెడ్డి

ఎల్బీనగర్: పార్కు అభివృద్ధి పనులు నాసిరకంగా చేపట్టడంపై బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి హెచ్ఎండీఏ అధికారులు, కాంట్రాక్టర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. డివిజన్ పరిధిలోని బీఎన్ రెడ్డినగర్ ఫేజ్–3లోని రూ.1.4 కోట్లతో జరుగుతున్న పార్కు పనులను గురువారం హెచ్ఎండీఏ అధికారులు డీఈ జగన్మోహన్‌రావు, ఏఈ జీవన్‌రెడ్డిలతో కలిసి కార్పొరేటర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పార్కు ప్రహరీ నిర్మాణ పనుల్లో నాణ్యతను పట్టించుకోవడం లేదని, టెండర్ నిబంధనల ప్రకారం పనులు చేయడం లేదని ఆరోపించారు. ఇసుకతో ప్రహరీ నిర్మించాల్సి ఉండగా సిమెంట్ వాడకుండా కేవలం డస్ట్‌తో నిర్మాణం చేపట్టడంపై ఆయన మండిపడ్డారు. ఇలా చేస్తే ప్రజల సొమ్ము వృథా కావడం తప్ప ఉపయోగం ఉండదన్నారు. పార్కు గోడ పక్కన నుంచి పైకాలనీల నుంచి వచ్చే వరద కాలువ ఉందని, వర్షం పడితే భారీగా నీటి ప్రవాహం ఉంటుందని, నాసిరకంగా నిర్మించిన గోడ కూలిపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. వెంటనే పనులను నిలిపివేయాలని, నాసిరకంగా పనులు చేస్తున్న కాంట్రాక్ట్ టెండర్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, శరత్, సురేష్, కామేష్ తదితరులు పాల్గొన్నారు.

కూల్చివేస్తాం: ఈఈ పద్మ

పార్కు పనులు నాసిరకం ఉన్నాయని అధికారులు తేల్చడంతో ఆ పనులను నిలిపివేసి, ఇప్పటి వరకూ జరిగిన నిర్మాణాన్ని కూల్చివేస్తామని హెచ్ఎండీఏ ఈఈ పద్మ తెలిపారు. నాసిరకంగా పనులు చేపడుతున్న అధికారులపై ఎలాంటి చర్యలు తీసుకుంటారని 'సాక్షి' ప్రశ్నించగా సమాధానం దాటవేశారు.

విద్యార్థులకు ప్లేట్లు అందజేత

నాగోలు: డివిజన్ పరిధిలోని బ్లైండ్స్ కాలనీ, జైపూర్ కాలనీ, నాగోల్‌ల్లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల్లో మహనీయుల జయంతి వేడుకల్లో భాగంగా బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా గురువారం బ్లూ హెల్ప్ డెస్క్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్లేట్లు, పలకలు అందజేశారు. ముఖ్య అతిథులుగా బీఎస్పీ ఎల్బీనగర్ జనరల్ సెక్రటరీ వేముగంటి సంపత్ హాజరై విద్యార్థులకు వాటిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో బ్లూ హెల్ప్ డెస్క్ స్పాన్సర్ జి రాజు. జి.భారతి. కె నరసింహ. కె. కిషోర్‌బాబు. శివశంకర్, లక్ష్మణ్, సతీష్, రాజేష్ పాల్గొన్నారు.

దళితులపై కపట ప్రేమ

మలక్‌పేట: బీఆర్ఎస్ తొమ్మిదేళ్ల పాలనలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి దండం పెట్టడానికి తీరిక లేని సీఎం కేసీఆర్ దళితులపై కపట ప్రేమ వలకబోస్తున్నారని భాగ్యనగర్ జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షుడు పాగ రాజేశ్వర్‌రావు అన్నారు. స్థానిక కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి మధుసూదన్‌రెడ్డి, బీజేపీ జిల్లా కోశాధికారి తుమ్మలపల్లి రమేష్‌రెడ్డి, వై.సురేందర్‌లతో కలిసి గురువారం మూసారంబాగ్ చౌరస్తాలోని బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని నీటితో శుద్ధి చేసి పూలమాల వేసి నివాళులర్పించారు. దళితులపై నిజమైన ప్రేమ ఉంటే దళిత సీఎం, మూడెకరాల భూమి వంటివి హామీలను అమలు చేయాలని బీజేపీ నిత్యం డిమాండ్ చేయడం వల్లే కేసీఆర్ 125 అడుగుల విగ్రహ ఏర్పాటుకు ముందుకు వచ్చారని అన్నారు. కార్యక్రమంలో నాయకులు చందు, సురేందర్, తులసి, ధర్మతేజ, నవీన్‌కుమార్, పవన్ కుమార్, నర్సింగ్‌రావు, వరప్రసాద్, దినేష్, మల్లేష్ పాల్గొన్నారు.

ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాలు దోహదం

నాగోలు: వేసవి కాలంలో ప్రజల దాహార్తిని తీర్చిడానికి చలివేంద్రాలు ఎంతో దోహదం చేస్తాయని పెద్దపల్లి డీఎస్పీ సారంగపాణి, ఎల్బీనగర్ ఏసీపీ శ్రీధర్‌రెడ్డి అన్నారు. నాగోల్ డివిజన్ పరిధిలోని సాయి నగర్ కాలనీలో తెలంగాణ గాడ్గే రజక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని గురువారం వారు ఎల్బీనగర్ సీఐ అంజిరెడ్డి, ట్రాఫిక్ అదనపు సీఐ నాగమల్లుతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో మైసమ్మ పోచమ్మ ఆలయ చైర్మన్ సిద్దాల ఐలయ్య, తెలంగాణ గాడ్గే రజక సంఘం ప్రధాన కార్యదర్శి వడినాల మడివేలు, పగడాల వెంకటేష్, పున్నం రాములు, కె మహేందర్, సిద్ధల అరవింద్, నాగరాజు, శివ, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణానికి నిధులు కేటాయించండి



జెడ్‌సీకి వినతి పత్రం అందజేస్తున్న కార్పొరేటర్ వెంకటేశ్వర్‌రెడ్డి

వనస్థలిపురం: డివిజన్ పరిధిలోని కాలనీల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని వనస్థలిపురం డివిజన్ కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి జీహెచ్ఎంసీ ఎల్బీనగర్ జోన్ జోనల్ కమిషనర్‌కు విజ్ఞప్తి చేశారు. గురువారం జెడ్సీని కలిసిన ఆయన వెంకటరమణ కాలనీ, పద్మావతి కాలనీ, శక్తినగర్, అనురాధ కాలనీ, హిల్ కాలనీ, ప్రశాంత్‌నగర్‌ల్లో సీసీ రోడ్లు నిర్మించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ప్రశాంత్ నగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు గోపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బాలాజీనాథ్, నాయకులు వాసు తదితరులు పాల్గొన్నారు.

పేదల ఆరోగ్య పరిరక్షణకు సీఎంఆర్ఎఫ్ దోహదం



ఎల్‌ఓసీని అందజేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

నాగోలు: పేదల ఆరోగ్య పరిరక్షణకు సీఎం సహాయనిధి ఎంతో దోహదపడుతోందని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. నాగోల్ డివిజన్ పరిధిలోని అరుణోదయ కాలనీకి చెందిన లక్ష్మీనారాయణ వెన్నెముక సమస్యతో బాధపడుతున్నాడు. వైద్యం చేయిద్దామంటే అతడి ఆర్థిక స్థితి బాగాలేదు. దీంతో కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని సంప్రదించారు. ఎమ్మెల్యే సహాయంతో ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేయగా, లక్ష్మీనారాయణ ఆపరేషన్ కోసం రూ. 1.50 లక్షల ఎల్‌ఓసీ విడుదలైంది. దానిని లబ్ధిదారు కుటుంబసభ్యులకు ఎమ్మెల్యే గురువారం అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు అనంతుల రాజిరెడ్డి, నాగోలు డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు తూర్పాటి చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు ఏకరువు పెట్టిన సలీంనగర్‌వాసులు

మలక్‌పేట: మినిస్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ డిపార్ట్‌మెంట్ వారు అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులతో గురువారం మూసారంబాగ్ డివిజన్ సలీంనగర్‌లో సమస్యలపై పరస్పర చర్చ వేదిక నిర్వహించారు. కార్యక్రమానికి స్థానిక కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి మధుసూదన్‌రెడ్డి, నోడల్ ఆఫీసర్, జీహెచ్ఎంసీ డీఈఈ ప్రదీప్‌కుమార్ హాజరయ్యారు. గణేష్ టెంపుల్ లైన్‌లో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు, స్థానిక పార్కులో ప్రహరీ నిర్మాణం, విద్యుత్ దీపాల సమస్య, పార్కు పరిసర ప్రాంతాల్లో ఆకతాయిలు మద్యం తాగుతున్నారని, చెట్ల కొమ్మలు తొలగించాలని కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు రమేష్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు కృష్ణారెడ్డి అధికారులకు విన్నవించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ.. వీలైనంత మేరకు సమస్యలు పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జలమండలి ఏఈ చంద్రునాయక్, సెక్టార్ ఎస్ఐ శృతిరెడ్డి, శానిటేషన్ జవాన్ రమేష్, ఎంటమాలజీ సూపర్‌వైజర్ గుండప్ప, స్ట్రీట్‌లైట్స్ ఇన్‌స్పెక్టర్ దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

నాలా పనులు ప్రారంభం

మూసారంబాగ్ పెద్ద బజార్ రేషన్ దుకాణం నుంచి సాయినగర్ కాలనీ సాయిరామ్ అపార్ట్‌మెంట్ వరకు చేపట్టనున్న నాలా నిర్మాణ పనులు గురువారం కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి మధుసూదన్ రెడ్డి ప్రారంభించారు. కాలనీవాసులు బాలు, సంతోష్, లక్ష్మణ్, సత్తయ్య తదితరులు ఉన్నారు.

కాలనీల్లోని సమస్యలను పరిష్కరించాలి



సమావేశంలో పాల్గొన్న కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ యాదవ్

నాగోలు: డివిజన్ పరిధిలోని వివిధ కాలనీల్లో పెండింగ్‌లో ఉన్న సీసీ రోడ్లు, డ్రైనేజీ సమస్యలను వెంటనే పరిష్కరించాలని నాగోలు డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ యాదవ్ అధికారులకు సూచించారు. గురువారం నాగోలు డివిజన్ పరిధిలోని శ్రీనివాస్‌కాలనీ, బండ్లగూడ విజయగార్డెన్, శివానీనగర్ ల్లోని పారిశుద్ధ్యం, ఇతర సమస్యలపై రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్లతో శ్రీనివాస్‌కాలనీలో నిర్వహించిన సదస్సులో ఆమె మాట్లాడారు. కాలనీల్లోని సమస్యలను అధికారులకు చెప్పాలని కాలనీ అసోసియేషన్ ప్రతినిధులకు సూచించారు. కాలనీల్లోని సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులకు ఆదేశించారు. ఏఈ చంద్రశేఖర్‌రెడ్డి, జలమండలి మేనేజర్ అలేఖ్యరెడ్డి, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

కొత్తపేట డివిజన్‌లో...

కొత్తపేట డివిజన్ పరిధిలోని జనప్రియ అపార్ట్‌మెంట్‌లో గురువారం ఇంటెన్సివ్ శానిటేషన్, ఆర్‌డబ్ల్యూఏ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న కొత్తపేట కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ కాలనీల్లోని రోడ్లు, డ్రైనేజీ శానిటైజేషన్, దోమలు, నీటి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో అధికారులు వెంకటేశ్వర్లు, లక్ష్మయ్య, చిరంజీవి, కాలనీ అధ్యక్షుడు స్వామి, అశ్విన్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

అగ్నిమాపక వారోత్సవాలను విజయవంతం చేయాలి



పోస్టర్ విడుదల చేస్తున్న ఎమ్మెల్యే బలాల, ఫైర్ ఆఫీసర్ ముస్తాఫా

మలక్‌పేట: ఈ నెల 14 (నేటి) నుంచి ఈనెల 20వ తేదీ వరకు నిర్వహించే అగ్నిమాపక వారోత్సవాలను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే అహ్మద్ బలాల పిలుపు నిచ్చారు. తెలంగాణ రాష్ట్ర విపత్తు స్పందన, అగ్నిమాపక సేవల శాఖ మలక్‌పేట ఫైర్ స్టేషన్ వారోత్సవాల పోస్టర్, కరపత్రాలు గురువారం ఎమ్మెల్యే విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అగ్నిప్రమాదాలు అరికట్టడానికి విస్తృతంగా ప్రజల్లో అవగాహన పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు.కార్యక్రమంలో మలక్‌పేట ఫైర్ ఆఫీసర్ ఎండీ ముస్తాఫా, ఫైర్‌మెన్ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుకుందామని పిలిచి కత్తితో దాడి

- 'రీల్స్' తీసుకొనే స్నేహితుల మధ్య పాతగొడవ నేపథ్యం..
- దాడి చేసిన యువకుడిని పోలీసులకు అప్పగించిన బాధితుడి స్నేహితులు



గాయపడిన మనోహర్



కత్తితో దాడి చేస్తున్న సోను

నాగోలు: పాత గొడవల విషయంలో రాజీ కుదుర్చుకునేందుకు వచ్చిన రెండు వర్గాల (యువకుల) మధ్య మాట మాట పెరిగి ఓ యువకుడిపై కత్తితో దాడి చేసిన ఘటన ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. వనస్థలిపురం విజయపురికాలనీ–2లో నివాసం ఉండే కొండబత్తిన మనోహర్(21) చంపాపేటలోని వేద డిగ్రీ కళాశాలలో డిగ్రీ 2వ సంవత్సరం చదువుతున్నాడు. తన స్నేహితుడి పుట్టిన రోజు ఉండటంతో మనోహర్‌తో పాటు శివ, శ్రీకాంత్, మణి బుధవారం రాత్రి కామినేని చౌరస్తాలోని మారుతీ లాడ్జిలోని ఓ గదిలో స్నేహితులతో కలిసి పార్టీ చేసుకున్నారు. సైదాబాద్‌కు చెందిన యువకులు సోను, శివ ఇతర స్నేహితులు తరచూ నగర శివారు ప్రాంతాల్లో బైక్ రైడింగ్ చేస్తూ రీల్స్ తీసుకుని ఇన్‌స్టాగ్రామ్‌లో అప్‌లోడ్ చేస్తుంటారు. గురువారం ఉదయం మనోహర్ స్నేహితుడైన శివకు సైదాబాద్‌కు చెందిన సోను ఫోన్ చేసి రీల్స్ తీసుకునేందుకు రమ్మన్నాడు. గత కొంత కాలంగా సోనుకు శివ దూరంగా ఉంటున్నాడు. తాను రానని శివ చెప్పడంతో ఇద్దరి మధ్య మాటమాట పెరిగింది. సోను, శివ మధ్య ఫోన్ సంభాషణ వింటున్న శ్రీకాంత్..శివ వద్ద నుంచి ఫోను తీసుకుని నా స్నేహితుడిని ఎందుకు తిడుతున్నావని ప్రశ్నించాడు. మీరు ఎక్కడ ఉన్నారో చెప్తే అక్కడికి వస్తామని సోనుతో అన్నాడు. ఎల్బీనగర్ ఎన్టీఆర్‌నగర్ కూరగాయల మార్కెట్ వద్ద ఉన్నామని చెప్పడంతో మనోహర్, శివ, శ్రీకాంత్, మణితో పాటు మరో మిత్రుడు తరుణ్‌తో కలిసి అక్కడికి వెళ్లారు. అప్పటికే అక్కడ సోను, వినయ్‌తో పాటు మరో ఇద్దరు స్కోడా కారులో ఉన్నారు. రెండు వర్గాల మధ్య మాటా మాటా పెరిగి గొడవ జరిగింది. సోను తన వద్ద ఉన్న కత్తి తీసుకుని మనోహర్ కడుపులో పొడిచాడు. దీంతో తీవ్ర రక్తస్రావమైంది. అక్కడే ఉన్న బాధితుడి స్నేహితులు సోనూను నిలువరించడంతో పాటు అతడిపై దాడి చేసి పట్టుకొని ఎల్బీనగర్ పోలీసులకు అప్పగించారు. పోలీసులు గాయపడ్డ మనోహర్‌ను కొత్తపేటలో ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో చేర్పించారు. బాధితుడు మనోహన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎల్బీనగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలా ఉండగా, గతంలో జరిగిన గొడవల విషయంపై సోను, మరో ఇద్దరు చైతన్యపురిలో ఉండే పాతనేరస్తుడి వద్ద పంచాయితీ పెట్టారని, అతడి సూచన మేరకే మనోహర్‌పై సోను కత్తితో దాడి చేశాడని ఘటన స్థలంలో ఉన్న యువకులు పేర్కొన్నారు. సోనుతో పాటు వచ్చిన వినయ్, మరో ఇద్దరు ఘటనా స్థలం నుంచి పారిపోయారు. దాడి చేసిన సోను, వినయ్ మద్యం మత్తులో ఉన్నట్లు సమాచారం ఎన్టీఆర్‌నగర్ కూరగాయాల మార్కెట్ అసాంఘిక కార్యక్రమాలకు అడ్డగా మారిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి సమయంలో గంజాయి గ్యాంగ్ మార్కెట్‌లో తిరుగుతూ అందరినీ బెదిరిస్తోందని తెలిపారు.